ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చందానగర్: 'స్వస్త్‌ నారి స్వశక్తి పరివార్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఓల్డ్ హఫీజ్‌పేట్ అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..ఈ నెల 17న నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్యులు, వైద్యాధికారులు, సహాయ క్షేత్ర సిబ్బందితో ఉచిత వైద్య శిబిరాలు చేపడుతున్నామన్నారు. మరికొన్ని ప్రదేశాలలో రక్తదాన శిబిరాలు, రోగనిరోధకత, పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం వంటివి అందిస్తామన్నారు. పిల్లలు, రిస్క్ గ్రూప్ ప్రజలకు రోటీన్ స్క్రీనింగ్ చేస్తామన్నారు. ఈ శిబిరంలో సీఏఎస్ వైద్యులు భాగ్యశ్రీ, అనూష, ల్యాబ్ టెక్నీషియన్ పండరి రెడ్డి, ఏఎన్‌ఎం లావణ్య, ఆశ వర్కర్ స్వప్న, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతలు తప్పనిసరి



పటాన్‌చెరు టౌన్: మ్యాన్‌హోల్స్‌పై మూతలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని డ్రైనేజీ, నాలా, మ్యాన్‌హోల్స్ సమస్యలపై సమగ్ర పరిశీలన చేసి, సమస్యలు ఉన్న చోట్ల తక్షణ మరమ్మతులు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని చెప్పారు. అదేవిధంగా కలుషిత నీరు తాగు నీటిలో కలువకుండా చూడాలన్నారు. సోమవారం లోపు సమగ్ర పరిశీలన చేపట్టి, సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం శివకృష్ణ, మేనేజర్ అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇందిరమ్మ మహిళా శక్తి'తో పేదరికాన్ని నిర్మూలిస్తాం

మంత్రి సీతక్క

మాదాపూర్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే పేదరికం అంతమవుతుందని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మాదాపూర్‌లోని ఇందిరా మహిళ శక్తి బజార్‌లో సారస్ మేళాను బాలల పరిరక్షణ కమిషనర్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..హైటెక్‌సిటీ వంటి విలువైన ప్రదేశాన్ని గ్రామీణ మహిళల చేతివృత్తులు, ఉత్పత్తుల ప్రదర్శన కోసం కేటాయించినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యమని తెలిపారు. సారస్ మేళాను సందర్శించి స్టాల్స్‌లో ఉన్న ఉత్పత్తులను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు కోటీశ్వరులుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్న పలువురు బ్యాంకర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, అదనపు సీఈఓ కాత్యాయిని, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, వీ హబ్ సీఈఓ సీతా పల్లచోళ తదితరులు పాల్గొన్నారు.



సారస్ మేళాను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులు

రాయదుర్గం: ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అభివర్ణించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 37 ఏళ్లుగా విద్యాబోధన చేసి పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం సక్రుసభావత్‌ను ఆయన శుక్రవారం ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ..సక్రుసభావత్ తన దశాబ్దాల విద్యా ప్రస్థానంలో అనేక తరాలను సన్మార్గంలో నడిపించి సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాసింగ్, హన్మంతునాయక్, మీన్‌లాల్‌సింగ్, నర్సింహ్మరావు, శేఖర్ తిరుపతి, సుమన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, రాజు, కృష్ణనాయక్, గోవింద్, విజయ్, కళ్యాణ్, విశాల్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సక్రుసభావత్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్: హిందీ భాష స్వాతంత్ర్యం రావడంలో కీలక పాత్ర పోషించిందని.. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హిందీ భాషకు 1949లో జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు రావాలని హిందీ దివస్ వారోత్సవాలు నిర్వహించుకుంటామన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. హిందీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ పూనం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యోగిబాబు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న వారిని ఆయన మెమొంటో అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌చంద్రారెడ్డి, మాదాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బసవలింగం, టీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు రాఘవేందర్, ఉపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, తాజ్‌బాబు, హనుమంతు, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఎన్నికలు ప్రశాంతం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం 2025–26 ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 81 శాతం మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్ పరిధిలో 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిల్లో విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో వివిధ పోస్టుల కోసం 169 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అందులో అధ్యక్ష పదవికి 8 మంది, ఉపాధ్యక్షుడుకు 5 మంది, ప్రధానకార్యదర్శికి 6 మంది, జాయింట్ సెక్రెటరీకి 5 మంది, కల్చరల్ సెక్రెటరీకి నలుగురు, క్రీడా కార్యదర్శి పదవికి నలుగురు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, ఎన్‌ఎస్‌యూఐ, డీఎస్‌యూ, ఏఎస్‌ఏ, ఎస్‌ఎల్‌వీడి, ఎంఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఏ, పీడీఎస్‌యూ, బీఆర్‌ఎస్‌వీ, ఏఐఓబీసీఎస్‌ఏ, టీఎస్‌ఎఫ్, టీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్లుగా కూడా పలువురు పోటీలో ఉన్నారు. వీరితోపాటు స్కూల్ బోర్డు సభ్యులు, స్కూల్ కౌన్సిలర్లు, ఇంటర్నల్ కాంప్లెయింట్ కమిటీ ప్రతినిధుల పదవులకు పోటీలో పలువురు విద్యార్థులు తమ సత్తాను చాటాలని బరిలో నిల్చున్నారు. అందరూ గెలుపుపై ధీమాతో ఉన్నారు.

నేడు ఓట్ల లెక్కింపు..

హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఓట్ల లెక్కింపును శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కాగానే ఫలితాలను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపును, క్యాంపస్‌లోని బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగియగానే బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాల నుంచి లెక్కింపు కేంద్రానికి తరలించి భద్రపరిచారు.

'పిచ్ 2 ప్రెస్'ను సద్వినియోగం చేసుకోవాలి

రాయదుర్గం: స్టార్టప్‌లు, స్కేల్‌అప్‌లు తమ కథలను ప్రపంచానికి చెప్పేందుకు 'పిచ్ 2 ప్రెస్'ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జర్నలిస్టులకు సూచించారు. శుక్రవారం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల ఆధ్వర్యంలో నిర్వహించే 'పిచ్ 2 ప్రెస్' కార్యక్రమం పోస్టర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచంలోనే తొలిసారిగా జర్నలిస్టుల ముందు నేరుగా ఇన్నోవేటర్లు తమ అనుభవాలను చెప్పుకునే అవకాశం ఇదన్నారు. పిచ్ 2 ప్రెస్ ఈవెంట్‌లో దేశ నలుమూలల నుంచి 100 కంటే ఎక్కువ ఐటీ బీట్ జర్నలిస్టులు పాల్గొంటున్నారన్నారు. డబ్ల్యూటీఐటీసీ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ..పిచ్ 2 ప్రెస్ అనేది ఒక ఈవెంట్ మాత్రమేకాదని, ఇది ఒక ఉద్యమం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజిథాన్ బృంద సభ్యులు భాగ్యలక్ష్మి వాకిటి, హేమా మారం, దీపికి జోషి, తేజస్విని, నితన్యహర్కరా, ప్రకాశ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఐసీఎస్ఎస్ఆర్ లాంగిట్యూడినల్ | స్టడీస్ కోసం నిధులు మంజూరు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకు భారీ పరిశోధనా ప్రాజెక్టులో భాగస్వామ్యం లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞా పరమితమిశ్రాకు సోషల్ అండ్ హ్యూమన్ సైన్సెస్‌లో ఐసీఎస్ఎస్ఆర్ లాంగిట్యూడినల్ స్టడీస్ కోసం పరిశోధనా ప్రాజెక్టు కింద రూ.1.20 కోట్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన బృందానికి ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సుజిత్‌కుమార్ మిశ్రా, ప్రాజెక్టు డైరెక్టర్లుగా హెచ్‌సీయూ ఆర్థిక శాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞాపరమితమిశ్రా, బెంగళూరు క్రైస్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కెఎస్‌సుజిత్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఈ ప్రాజెక్టు 'ఒడిశాలో జెండర్–జస్ట్ ఫ్యూచర్‌ను అభివృద్ధి చేయడం, వికసిత్ భారత్ దృష్టితో కూడిన సమగ్ర పారిటీ ఫ్రేమ్‌వర్క్స్ యొక్క లాంగిట్యూడినల్ స్టడీ'అనే శీర్షికతో ఉంది.



ప్రజ్ఞా పరమితమిశ్రా

స్వచ్ఛభారత్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



స్వచ్ఛభారత్‌లో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

రాయదుర్గం: చేతుల్లో చీపుర్లు పట్టారు. రోడ్డు పక్కన పేరుకపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్‌రాందీన్ పర్యవేక్షణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి తండాలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ..స్వచ్ఛభారత్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేశారని, జీహెచ్‌ఎంసీ కార్మికులు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినా ఎవరి పరిసరాల్లో వారు పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చేసుకుంటే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాసింగ్, హన్మంతు నాయక్, మీనల్‌లాల్‌సింగ్, నర్సింహారావు, శేఖర్, సుమన్, తిరుపతి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను రాజు, కృష్ణ నాయక్, గోవింద్, విజయ్, కల్యాణ్, విశాల్‌సింగ్ పాల్గొన్నారు.